




## అదనపు ఎస్‌పి బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి-నెల్లూరు**

జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్) గా సి.హెచ్. సౌజన్య బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె రాజమహేంద్రవరం నుంచి జిల్లాకు అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్)గా ఆమె ఇక్కడ పోస్టింగ్ పొందారు. శనివారం ఎస్‌పి కార్యాలయానికి చేరుకున్న ఆమె అడిషనల్ ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌లో డిఎస్‌పిగా ఎపికైన ఆమె తెనాలి, గుంటూరు క్రైం, ఇంటిలిజెన్స్, చేవెళ్ల, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేశారు. ఆమెకు జిల్లా పోలీస్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అదపు ఎస్‌పి సిహెచ్ సౌజన్య

# 'ఎస్మా'కు బెదిరేది లేదు..!

## ప్రభుత్వ చర్యపై అంగన్‌వాడీల ఆగ్రహం - 26వ రోజుకు చేరిన సమ్మె



అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు

**ప్రజాశక్తి-నెల్లూరు**

రాష్ట్ర ప్రభుత్వం చేసిన హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీల చేస్తున్న నిరవధిక సమ్మె యథావిధిగా కొనసాగుతోంది. శనివారం నాటికి 26వ రోజుకు చేరింది. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు యధాతదంగా నిరవదిక సమ్మె శిబిరంలో బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం తెచ్చే జీవోలకు గాని, ఎస్మాలకు అంగన్‌వాడీలు బెదిరే ప్రసక్తేలేదన్నారు. 26 రోజుల తర్వాత అంగన్వాడి సేవలు అత్యవసర సేవలను ఈ ప్రభుత్వం గుర్తించడం సిగ్గుచేటని, జీవో నెంబర్ 2 అంగన్వాడీలకు వర్తించదని ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. అంగన్వాడీలపై ప్రయోగించాల్సింది ఎస్మా కాదని, సానుకూలంగా చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు ఇప్పటికే పలు ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నాయన్నారు. జిఒ నెంబర్ 2ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ ,నాయకులు బత్తల కష్ణయ్య ,అంగన్వాడీ నాయకులు కామాక్షమ్మ మల్లెమ్మ కల్పన రమాదేవి నాగభూషణమ్మ సంపూర్ణమ్మ వెంకట కుమారి రత్నమ్మ శాంతమ్మ భారతి ఉన్నారు.

### కలెక్టరేట్ ఎదుట 24 గంటల రిలే దీక్ష

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దారుణమని పలువురు నేతలు పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మె 26వ రోజు సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఐద్వా నేతలు అంగన్‌వాడీలకు పూల హారాలు వేసి రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ అంగన్‌వాడీలు గత 26 రోజులుగా న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే సమాధానం చెప్పనటువంటి రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎస్మా చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. ఇది ముఖ్యమంత్రి చేతగానితనానికి నిదర్శనమన్నారు. వైద్యసేవలు, విద్యుత్ వంటివి అత్యవసర సేవల కిందకు వస్తాయని,ఐసిడిఎస్ అందించే సేవలు అత్యవసర సేవల కిందకు వస్తాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని తీసుకరావడం పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం వేయడమేనన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, పెట్రోల్ ,డీజిల్ ధరలు, చెత్త పన్నుతో సహా విపరీతంగా ధరలు పెంచిన ఈ ఈ ప్రభుత్వానికి అంగన్వాడీ కార్మికుల వేతనాలు పెంచడానికి ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు టి శివకుమారి నగర కార్యదర్శికె పద్మ రూరల్ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి మహిళా సంఘం సీనియర్ నాయకులు అరిగెల రామమ్మ జిల్లా కమిటీ సభ్యులు షేక్ శంషాద్ ఎస్ డి నా జున్ని ఎం సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలను ప్రారంభిస్తున్న ఐద్వా నాయకులు

### ఎస్మా ప్రయోగం బాధాకరం : సోమిరెడ్డి

గడిచిన 26 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె నిరవధికంగా సాగుతున్నా ముఖ్యమంత్రి పట్టించుకోక పోవడం బాధాకరమని, ఇప్పుడు వారిపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమని మాజీ మంత్రి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చేసిన హామీలు అమలు చేయాలంటూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కలెక్టర్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టిన అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆయన వెంట టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల.వెంకటేశ్వర రెడ్డి, పలువురు టిడిపి నేతలు ఉన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.



అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి 'సోమిరెడ్డి'



సమ్మె చేస్తున్న ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులు

## 'ఎస్‌ఎస్‌ఎ' ఉద్యోగుల సమ్మె

**ప్రజాశక్తి-నెల్లూరు**

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 18 వ రోజుకు చేరింది. నిరవధిక సమ్మెలో భాగంగా జెపిసి నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్యంగా నిర్వహించిన ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు చర్చలకు ఆహ్వానించి హెచ్‌ఆర్ పాలసీ మీద కమిటీ వేస్తామని, అందుకు విద్యాశాఖ మంత్రి తో మాట్లాడి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలకు తృప్తి చెందని జేసిసి నాయకులు లిఖితపూర్వకంగా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి గారిచే ప్రకటిస్తేనే సమ్మె విరమింప చేస్తామని లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎస్‌ఎస్‌ఎ సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ మరో రెండు నెల్లో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రాగానే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు జేపిసీ నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

### ప్రజా సంఘాల నుంచి పెరుగుతున్న మద్దతు



మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

**ప్రజాశక్తి-నెల్లూరు :**మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన కోర్కెల సాధన నిమిత్తం చేస్తున్న నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరవదిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. నగరంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దర్గామిట్ట ప్రాంతంలోని బారాషాహిద్ దర్గా ప్రాంతం నుంచి కార్పోరేషన్ కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత బారాషాహీద్ దర్గా వద్ద మునిసిపల్ కార్మికులు ప్రార్ధనలు నిర్వహించి జగన్ మనసు మారాలని ఇచ్చిన మాట ప్రకారం పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు వేడుకున్నారు. అనంతరం బారాషాహీద్ గ్రౌండ్ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన గేటు ఎదుట బైటాయించి నిరసన, ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమానికి నగరపాలక సంస్థలో పనిచేస్తునన కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొని మద్దతు తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. సమ్మె అణచివేసేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రయత్నిస్తే అందుకు పది రెట్లు ఉధృతంగా సమ్మె కొనసాగుతుందన్నారు. దళిత గిరిజన మహిళలపై కార్పొరేటర్ల అనుచరులు దాడులు చేయడం విచారకరమన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కొర్కెలను మలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్, అల్లాడి గోపాల్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, సుజాతమ్మ, అశోక్, దేశ మూర్తి, లోకేష్, సునీల్, సుబ్బు, నాగేశ్వరరావు, మనోజ్, బాలు, కష్ణ, ముని మోహన్ బాబు, మహేష్, వంశీ, షబ్బీర్, మరియన్న, కిరణ్, కంప్యూటర్ ఆపరేటర్లు సుధా బాబు, భరత్,రఫీ పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

**ఉలవపాడు :** గ్రంథాలయంలో శనివారం మన గ్రంథాలయం అనే కార్యక్రమంలో నిర్వహించినట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరావు తెలిపారు. గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మొక్కలకు నీరు పోసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహం పరిశీలన

**ప్రజాశక్తి - నెల్లూరు సిటీ :** విజయవాడలో ఈనెల 19వ తేదీన అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిం చాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక వి.ఆర్.సి కూడలిలోని అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అన్ని అంబేద్కర్ విగ్రహాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని, నూతన శోభను సంతరించుకునేలా ఏర్పాట్లను చేయాలన్నారు.నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం

**నెల్లూరు అర్బన్ :**గడిచిన నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు తీరని అన్యాయం చేశారని టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరు నగరంలోని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కార్పొరేషన్‌లను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను విఫరీతంగా పెంచి సామాన్యుడిపై మోయలేని భారాలను మోపారన్నారు.నెల్లూరు రూరల్ లో బీసీ భవన్ అసంపూర్తిగా నిధులు లేక మూలన పడిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పాడటం ఖాయమన్నారు. టిడిపి నేతలు తాటి వెంకటేశ్వర్లు, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, మలినేని వెంకయ్య నాయుడు, కాకుపల్లి శివ, నందిపాటి శ్యామ్ ఉన్నారు.

### నేతాజీ ఎంఎస్ఆర్ పాఠశాలలో

## ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్:** శ్రీ నేతాజీ పైలెట్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. విద్యారత్నం శ్రీ నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల సమక్షంలో 2024 సంక్రాంతి వేడుకలను గ్రామీణ వాతావరణంలో నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా వాకర్స్ వి. మురళీమోహన్ రావు పాల్గొన్నారు. భోగిమంటలు ,హరి దాసులు, రంగవల్లులు, కోలాటాలు, సోది చెప్పడం, గంగిరెద్దులను తీసుకు రావడం వంటి కార్యక్ర మాలతో పాఠశాల ప్రాంగణంలో గ్రామీణ వాతావరణం తీసు కొచ్చారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. గ్రామీణ సాంప్రదాయాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడారు. తమ విద్యార్థులచే జాతీయ పండుగలే కాకుండా వివిధ మత సాంప్రదాయాలకు సంబంధించిన పండుగలను ఆయా సాంప్రదాయాల రీతిలో నిర్వహి స్తుంటామన్నారు. పిల్లల్లో అన్ని మతాల సమానమేనన్న భావనను కలిగించటమే తమ ఉద్దేశ్యమని తెలిపారు. ముఖ్యఅతిథిగా వాకర్ వి .మురళీమోహన్‌రావు భోగిమంటను ప్రారంభించారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రామ్ మాట్లాడారు. సంస్కృతిని కాపాడుకోవాలన్నారు.



## అరాచక పాలనకు చరమగీతం : టిడిపి

**ప్రజాశక్తి-కందుకూరు :** సిఎం జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. శనివారం అయన ఇక్కడ మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రాన్ని లూటీ చేసిన జగన్మోహన్ రెడ్డి, మళ్ళీ కులాల పేరుతో ప్రజలను విడగొట్టి ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కాలని ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి చేతగాని పరిపాలన కారణంగాలా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రాన్ని గాడిలోపెడతారన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాశక్తి-కందుకూరు :** ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, సుధా మాధురి కుమారుడు శ్రీహర్ష, యోగ శ్రీ నిశ్చితార్థ వేడుక విజయవాడలోని మెట్రోపాలిటన్ హోటల్లో శనివారం జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో కలిసి పాల్గొని కాబోయే నూతన వధూవరులను కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు.

## జిఒ నెంబర్ -2ను రద్దు చేయాలి : టిడిపి

**ప్రజాశక్తి-కందుకూరు :** సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు రాష్ట్రవ్యాప్తంగా గత 26 రోజుల నుండి శాంతియుత మార్గంలో నిరసన తెలియజేస్తుంటే స్పందించకపోవడం దారుణమన్నారు. వారిని బెదిరొచేందుకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జిఒ నెంబర్ 2 తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీలకు అండగా ఉంటామన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ జి. ప్రసాద్ బాబు ఎపిసిఎన్‌యఫ్ నెల్లూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య ఆధ్వర్యంలో రైతులకు, రైతు మహిళలకు ప్రకతి వ్యవసాయంపై వర్క్‌షాప్; శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ జి ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయాన్ని మరింత మందితో అవాలంభించడానికి అవసరమైన ఉత్పదాకాలను తయారుచేసి ఒక ఔట్లెట్స్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మాలకొండయ్య మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్ సునీత, సిఆర్‌పిలు,రైతులు, రైతుమహిళలు పాల్గొన్నారు.

## సిఎం చెప్పేవి అసత్యాలు : టిడిపి

**ప్రజాశక్తి - నెల్లూరు** సిటీ :మన రాష్ట్ర సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్ని అసత్యాలే చెబుతున్నారని టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర పేర్కొన్నారు. నెల్లూరు టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూ.3వేలు పింఛన్ ఇస్తాని నమ్మించి వంచించిన జగన్ రెడ్డి పెన్షన్ల గురించి నిజాలు చెప్పే ధైర్యం లేదన్నారు. రూ.3 వేల పెన్షన్ పై మాట మార్చి ఒక్కొక్కరికి రూ.30వేలు ఎగనామం పెట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి రూ.200 ఉన్న పెన్షన్ 2019 నాటికి రూ.2000 చేశారన్నారు. ఐదేళ్లలో రూ.1800 పెంచిపెన్షన్ లబ్దిదారుల సంఖ్య 34 లక్షల నుండి 54.25 లక్షలకు అందించారన్నారు.


## బస్సు యాత్రకు భారీగా జనం

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :**సర్వేపల్లి నియోజకవర్గంలో శనివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తోటపల్లిగూడూరు మండలం, నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలో దాదాపు 2,500 నుంచి 3 వేల వరకు 25 బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లలో సామాజిక సాధికార బస్సు యాత్రకు వైసిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, సానుభూతి పరులు, ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అభిమానులు తరలి వెళ్లారు. శంకరయ్య గౌడ్ మా ట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు వైసిపి ప్రభుత్వం సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా అండగా నిలిచింద నేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యా త్ర విజవంతం కావడమే నిద ర్శనం అన్నారు.



## లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి - వలేటివారిపాలెం :** అర్హత కలిగిన ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను వైసిపి ప్రభుత్వం అందించిందని ఎంఎల్‌ఎ మానుగుంట మహేందర్రెడ్డి తెలిపారు. వల్లేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 3.000 పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరు భారతి , పద్మజ, తహశీల్దార్ సుందరమ్మ ఎంపిటిసి చింతలపూడి రవీంద్ర సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు స్థానిక నాయకులు పరిటాల ఏరా స్వామి అనుముల వెంకటేశ్వర్లు ఇంటూరి హరిబాబు కుంభాల క్రాంతి కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ 'మానుగుంట '

## సమిష్టి కృషితో విజయం : టిడిపి

**ప్రజాశక్తి- నెల్లూరు సిటీ :** వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన నాయకులు సమిష్టి కృషితో విజయం సాధించి సత్తా చాటాలని మాజీ మంత్రి, నగర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొంగూరు నారాయణ టిడిపి ముఖ్య నేతలకు సూచిం చారు. నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజి లోని క్యాంపు కార్యాలయంలో టిడిపి పార్ల మెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి ఆయన శనివారం 28 డివిజన్ల టిడిపి నాయకులు, ప్రెసిడెంట్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ 2024 ఎన్నికల్లో ఎలా పని చేయాలి అనే అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. మన అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు వైసిపి వైఫల్యాలు, అరాచకాలను తెలియజేయాలని సూచించారు. పొంగూరు నారాయణ మాట్లాడుతూ రానున్న రోజులు ఎంతో కీలకమన్నారు. ప్రతీ ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్తలు, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అభిమానులందరూ కలిసి కట్టుగా పని చేసి విజయం సాధించాలన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

## టిడిపిలో భారీగా చేరికలు


### చంద్రబాబు సమక్షంలో కండువాలు కప్పుకున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కందుకూరు :**టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా 100 మందికి పైగా వైసిపికి చెందిన నేతలు, ఆ పార్టీకి గుడ్ బై చెప్పి తెలుగుదేశంలో చేరారు. రా... కదలిరా కార్యక్రమంలో భాగంగా, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కనిగిరికి రాగా శనివారం ఉదయం ఆయన సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. కొత్తగా చేరుతున్న వారందరినీ ఇంటూరి నాగేశ్వరరావు పేరు పేరునా పరిచయం చేయగా చంద్రబాబు నాయుడు వారందరినీ పలకరిస్తూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా పార్టీలో చేరిన వారిలో పంచాయతీ సర్పం చులు, వార్డు మెంబర్లు, వైసిపి కమిటీలలో సభ్యులు, పలువురు సీనియర్ కార్యకర్తలు ఎక్కువగా ఉన్నారు. ప్రధానంగా ఉలవపాడు, గుడ్లూరు మండలాలకు చెందిన బీసీ నేతలు పసుపు కండవాలు కప్పుకున్నారు. భారీ చేరికలు జరగడంతో ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావు పై చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. కందుకూరు పట్టణ మండల పార్టీల అధ్యక్షులు సీనియర్ నేతలు, ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నలదలపూరులో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

**వలేటివారిపాలెం :**మండలంలోని నలదలపూరులో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు కాంస్యవిగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. నలదలపూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అత్తోట వెంకట రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ , తెలుగు యువత, గ్రామంలోని సీనియర్ నాయకులు మరియు గ్రామంలోని తెలుగు మహిళల ఆధ్వర్యంలో వేద పండితులు , గ్రామ పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ నేపథ్యంలో బహిరంగ సభను పార్టీ రాష్ట్ర నాయకులతో నలదలపూరు గ్రామంలో నిర్వహిస్తామన్నారు. టిడిపికందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాంతో చర్చించి త్వరలో బహిరంగ సభ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీ అత్తోట వెంకట రమేష్ బాబు , గ్రామపెద్దలు పొన్న గంటి రామయ్య , కంద్రా శ్రీనివాసులు , సురేష్ , అత్తోట విశ్వనాథం , అత్తోట రవి , నవులూరి వెంకట కష్ణయ్య , దువ్వూరి రమేష్ చంద్ర , అత్తోట రంగస్వామి , అత్తోట వెంకటేశ్వర్లు , చల్లా మధు , మన్నం అశోక్ , దామా నాగార్జున ఉన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నెల్లూరు అర్బన్ :**నెల్లూరు రూరల్ నియోజకవర్గం, స్థానిక 28వ డివిజన్‌లో రూ. 30 లక్షలతో డివిజన్ ఇన్‌ఛార్జి నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్లు, కాలువలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎం.పి.ఆదాల ప్రభాకర్ రెడ్డి మంచి కృషి చేశారన్నారు. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. డివిజన్ నేతలు,కార్యకర్తలు ఉన్నారు.

## అంగన్‌వాడీలకు మద్దతుగా మానవహారం

**ప్రజాశక్తి-కందుకూరు :** సమస్యలు పరిష్కరించాలని అడుగుతున్నా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాంటిదని వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఎఐ టియుసి, సిఐటియు, మున్సిపల్ కార్మికుల డిమాండ్ చేశారు. గత 25 రోజులనుకంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ఉపయో గించటాన్ని నిరసిస్తూ కందుకూరు అంబేద్కర్ బొమ్మ వద్ద మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్వహించారు. ఏఐటియుసి నాయకులు ఆనందమోహన్, సిఐటియు నాయకులు ఎస్ ఏ గౌస్ మాట్లాడారు. తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని రద్దు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కందుకూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాను రమణ ,నాగేశ్వరరావు ,మున్సిపల్ వర్కర్ యూనియన్ సిఐటియు నాయకులు దాల శేషమ్మ, ఎద్దు కొండమ్మ ఉన్నారు.



## దుస్తులు పంపిణీ

**కందుకూరు :** ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని శనివారం కొత్తూరి హరి కోటేశ్వరరావు ( ప్రముఖ న్యాయవాది),పద్మ (టీచర్) దంపతుల సహకారంతో కందుకూరు పట్టణం మాల్యాద్రి కాలనీలోని పేద పిల్లలకు నూతన వస్త్రములు పంపిణీ చేయడం జరిగింది. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు.


## పారిశుధ్య కార్మికుల భిక్షాటన

**ప్రజాశక్తి-కందుకూరు :** స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్లో మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎసిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె నాలుగో రోజు శనివారం కొనసాగింది. ఈ సమ్మెలో భాగంగా పట్టణంలోని పలు దుకాణాలలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఏఐటియుసి ,సిఐటియు నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని తన పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటియుసి నాయకులు వై.ఆనందమోహన్, సిఐటియు నాయకులు ఎస్.ఎ గౌస్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రవణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, సిఐటియు నాయకులు శేషమ్మ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## యాత్రికులకు మెరుగైన వసతులు

**వలేటివారిపాలెం :**లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతుల కల్పనే తమ ప్రధాన ధ్యేయం అని ఎంఎల్‌ఎ మానుగుంట మహేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎంఎల్‌ఎ వెంట ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు, ఎస్ఐ ఉన్నారు. మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆదాయం 6,73,860 రూపాయలు వచ్చాయి ఆలయ ఇఓ కె.బి.శ్రీనువాసురావు తెలిపారు



## సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

**పొదలకూరు :** పొదలకూరులోని యుటిఎఫ్ భవన్‌లో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు జరిగాయి. సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శేషులు, జి.వి చలపతి శర్మ హాజరయ్యారు. మొట్టమొదటి మహిళ ఉపాధ్యా యురాలుగా సావిత్రి బాయి పూలే చేసిన త్యాగనిరతిని కొని యాడారు. ఆమె స్ఫూర్తితో మహిళా ఉపాధ్యా యులు సమాజా భివృద్ధికి పాటు పడాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యా యులను అభినం దించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు శైలజ జిల్లా కార్యదర్శి సుభాషిని , రాష్ట్ర కౌన్సిలర్ బి వెంకటేశ్వర్లు , గౌరవాధ్యక్షులు పెంచల రెడ్డి ప్రధాన కార్యదర్శి బివిపి కళ్యాణ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

### ఉపాధ్యాయురాలు జ్యోతికి అవార్డు

దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని యుటిఎఫ్ ప్రదానం చేస్తున్న సావిత్రీ బాయి పూలే అవార్డుకు పట్టణంలోని డిఎన్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న జ్యోతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డిఎన్‌ఆర్ జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతిని, హెచ్. ఎం, తోటి ఉపాధ్యాయులు శాలువా,పూలమాలతో సత్కరించారు. ఏటా యుటిఎఫ్ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, అవార్డులతో సన్మాని ంచడం శుభపరిణామని హెచ్.ఎం పెర్సిస్ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే కషి వల్లనే నేడు మహిళలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాం స్కృతిక రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు.

## బాల్య వివాహాలపై అవగాహన



**ప్రజాశక్తి-కావలి** : కావలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్.ఖాదర్‌బీ ఆధ్వర్యంలో విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాలపై తల్లిదండ్రుల పాత్ర, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కార్యక్రమం ప్రధానోపాధ్యాయిని ఎ.ఎం.వి. శేషమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కావలి మున్సిపల్, కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ అతిచిన్న వయస్సులోనే ఆడపిల్లలకు బలవంతపు, వివాహాలు జరిపించి నందు వల్ల ఆరోగ్య విషయంలో ఎన్నో సమస్యలకు లోనై శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు ఖాదర్ బి, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ ఈ అవగాహన వల్ల కొంతైనా బాలికల్లో, తల్లి దండ్రుల్లో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో బాల కార్మిక వ్యతిరేక సంస్థ జిల్లా కన్వీనర్, మహమ్మద్ అబ్దుల్ అలీం, రత్నమ్మ ఫౌండేషన్, ఎంవి ప్రసాదరావు, విశ్రాంత ఉప తహశీల్దార్ మొఘల్ శిరాజ్ బేగ్, జాగో సంస్థ షేక్ జమీర్, గుడ్‌మెన్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల నిల్వలపై పర్యవేక్షణ



**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : పట్టణంలోని సిండికేట్ ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఎరువులు నిల్వ నిమిత్తం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ తనిఖీ చేశారు. ప్రస్తుతం రబీ సీజన్లో వచ్చిన ఎరువులు అమ్మకాలు, నిల్వలపై అన్ని గోడౌన్‌లో తనిఖీ చేశారు. గడిచిన డిసెంబర్ 2023వ సంవత్సరంలో సిండికేట్ ఫార్మర్ సొసైటీ ద్వారా 388.150 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు, రాబోయే 2 3 రోజులలో 75 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేస్తామని పత్రికా పూర్వకంగా తెలియజేస్తున్నామన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని క్రమం తప్పకుండా యూరియా నిల్వలు అన్ని ఆర్‌బికెలలో ప్రయివేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, సిండికేట్ ఫార్మర్ సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

## రూ.40వేలు విరాళం



**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : పట్టణంలో గత దసరా నుండి శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన పలువురికి అంత్యక్రియల కోసం ఇస్తున్న రూ.10వేల నగదు విరాళం నిర్విరామంగా కొనసాగుతుంది. గత కొన్ని రోజుల క్రితం 22వ వార్డు జ్యోతి నగర్‌లో మృతి చెందిన నలతోటి చిన్న కొండయ్య కుటుంబ సభ్యులను నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. 5వవార్డు పరిధిలోని జెఆర్‌పేటలో ఇటీవల మృతి చెందిన షేక్ సత్తార్ సాహెబ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. 20వ వార్డు పరిధిలోని క్రిస్టియన్ పేటలో మృతి చెందిన యువకుడు కనుపూరు ప్రేమకుమార్ కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. 9వ వార్డు పరిధిలోని నాగేంద్ర పురంలో ఇటీవల మృతి చెందిన సిద్ధివటం సీతారామయ్య కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మహబూబ్ బాషా, సురా భాస్కర్ రెడ్డి, రమాదేవి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, యానాది రెడ్డి, మెప్మా ఆర్‌పిలు శిరీష, రాహిసాబేగం, వెంకటసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : రాష్ట్రాన్ని ఈ సైకోపాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదలి ముందుకు రావాలని అవినీతి అరాచక పాలన తుది ముట్టించడం మనందరి బాధ్యత అని మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా కదలి రా.. అనే కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరుస్తామని దాని ద్వారా సైకో జగన్ రాష్ట్ర ప్రజలను ఎలా లూటీ చేశాడో వివరిస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో మన అక్కచెల్లెమ్మలకు మానప్రాణాలకు ఈ ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయిందని, బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు దగాపడ్డారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములు అనే తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలపై దాడులు పెరిగాయని ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహాలో బిసి రక్షణ చట్టం తెచ్చి వారికి టిడిపి అండగా నిలబడుతుందన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన 'రా కదిలి రా' బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలకు టిడిపి కార్యకర్తలకు అభిమానులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి



**ప్రజాశక్తి-కోవూరు** : ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జనవరి 9వ తేదీన జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రా కదలి దా అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోవూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ దినేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వైసిపి ప్రభుత్వ నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయన్నారు. వైసిపీ ఎమ్మెల్యేలు దోచుకోవడమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో అమలు చేసిన పథకాలపై ప్రజలకు మరింత అవగాహన చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పాలనలో అన్ని నియోజకవర్గాలతో పాటు మండలంలో కూడా మినీ సైకోలు తయారయ్యారన్నారు. ప్రజలు కూడా ఈ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని జనసేన నాయకులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు ప్రసంగించారు. టీడీపీ నేతలు కృష్ణచైతన్య, మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీధర్, వెంకటరమణయ్య, శ్రీహరితో పాటు జనసేన నాయకులు అల్తాఫ్, తదితరులున్నారు.


## టిడిపిలో చేరికలు

**ప్రజాశక్తి-కొడవలూరు** : మండలంలోని పాత వంగల్లు నరేంద్రబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సమక్షంలో భారీగా టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైసిపి పతనానికి తొలిమెట్టుగా కొడవలూరు పాత వంగల్లు గ్రామంలో 60 శాతం మంది నరేంద్ర బాబు ఆధ్వర్యంలో టిడిపిలోకి చేరడం వైసిపి ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో గద్దె దించడం తప్పదన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎలక్షన్ కోడ్ రాగానే నియోజకవర్గం మొత్తం టిడిపిలోకి చేరుతారని తెలిపారు. అనంతరం నార్తురాజుపాలెం పివికర్ కల్యాణ మండపంలో టిడిపి కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, చెముకుల చైతన్య, గరికపాటి రాజేంద్ర, దేగ దయాకర్ పాల్గొన్నారు.

## క్రీడలకు సిఎం భారీ ప్రోత్సాహం

**ప్రజాశక్తి-కొడవలూరు** : పల్లె క్రీడలకు మన ముఖ్యమంత్రి జగనన్న భారీగా ప్రోత్సాహం అందిస్తున్నారని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలకు శనివారం క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి క్రీడా కారులుగా ఎదగాలన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జె.వసంతకుమారి, ఎన్.అంకయ్య, ఎంపీపీ జె.జ్యోతి, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఎం. బ్రహ్మానందరెడ్డి, ఎస్.కె షబ్బీర్, టి.సురేష్, అంకమరాజు, డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## సకాలంలో విధులకు రారు..



**ప్రజాశక్తి-కోవూరు** : స్థానికంగా ఉండరు. సకాలంలో విధులకు రారు. వసతి గృహంలో విద్యార్థులకు అవసరమైన సరుకులు స్టాక్ ఉండదు. ఈ విధంగా చిమిడిపోయిన అన్నంను మీ బిడ్డలకు పెడతారా.. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో వసతి గృహంలో వెనుకబడిన అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన మెనూని అందించాలని ఆదేశిస్తున్నా అవి కేవలం గోడకే పరిమితం అవుతున్నాయా తప్ప వాస్తవ రూపంలో కార్యరూపం దాల్చడం లేదు.. ఫలితంగా వసతి గృహంలోని విద్యార్థులు.. ఏది పెడితే అది తిని నాసిరకం భోజనంతో భయపడుతున్నారు. అధికారులు ఏం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా మీరు మారకపోతే శాఖపరమైన కఠిన చర్య తప్పదని రాష్ట్ర సివిల్ సప్లయ్ బోర్డు కమిషన్ సభ్యులు జి దివి అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ సముదాయంలో శుక్రవారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె సాంఘిక సంక్షేమ వసతి గృహం మొదలుకొని తనిఖీలు చేపట్టారు. సకాలంలో ఈ వసతి గృహ సంక్షేమ అధికారి విధులకు ఆలస్యంగా వచ్చారు. అప్పటికే వంట గదిలో విద్యార్థులకు భోజనం కూరా కూడా రెడీ చేసి ఉన్నారు వండిన అన్నాన్ని పరిశీలించి తిని చూసారు. ఆమె. తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్నం పూర్తిగా చిమిడిపోయి ఉండడమే కాకుండా వండిన కూరా కూడా నిర్ణయించబడిన విధంగా లేకపోవడం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి నాసిరకం భోజనాన్ని మీ పిల్లలకైతే పెడతారా అని ప్రశ్నించారు. స్టోర్ రూమ్ లో సైతం స్టాకు కూడా సరిగా లేకపోవడం విద్యార్థులకు. రాగి జావా కాస్తున్న బెల్లం కూడా పుచ్చిపోయి ఉండడం పట్ల. ఆమె సంక్షేమ అధికారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూపిస్తున్న సంక్షేమ అధికారి వెంటనే సస్పెండ్ చేయాలని అక్కడే ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి. రమేష్ కు సూచించారు. ఆదివిధంగా అన్నం కూరలను నాసిరకం వండకుండా నాసిరకం తయారు చేశారు.

# కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

**9న ప్రజాసంఘాలతో మహా ఉద్యమం**



ఉదయగిరిలో మాట్లాడుతున్న కె.అజయ్‌కుమార్

**ప్రజాశక్తి-ఉదయగిరి** : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే 9న అన్ని జిల్లా కేంద్రాలలో అన్ని ప్రజా సంఘాల మద్దతుతో మహా ఉద్యమం చేపడతామని సిఐటియు జిల్లా కార్యదర్శి అంగన్‌వాడీ అండ్ వెల్ఫేర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మాట తప్పని మడమతిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో అంగన్‌వాడీ అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నెరవేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రజియా, ప్రమీల, చాంద్ బేగం, రమాదేవి, కాకు వెంకటయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-అనంతసాగరం** : అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించినా అంగన్‌వాడీలు భయపడేది లేదని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. గత 26రోజుల నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, మర్రిపాడు మండలం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు లక్ష్మి, సుజాత, అరుణ, అంగన్‌వాడీలున్నారు.

**ప్రజాశక్తి-కావలి రూరల్** : అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె 26వ రోజు శనివారం అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ నిర్బంధాలు ప్రయోగించి ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, నిర్బంధాలతో పోరాటాలు ఆగవని, వెంటనే స్పందించి అంగన్‌వాడీ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు టి రమాదేవి, సుభాషిని, విజయ లత, పెంచలమ్మ, ఆషా, అంగన్‌వాడీలు, హెల్పర్లున్నారు.

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమ్మెలో భాగంగా శనివారం అంగన్ వాడీలు మండల కార్యాలయంలో కర్రీ ఆటలను ఆడి వినూత్నంగా నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపేందుకు సిఐటియు జిల్లా నాయకులు గడ్డం అంకయ్య పాల్గొన్నారు. గెలుపొందిన అంగన్‌వాడీలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు చేవూరు రాజా, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు తిక్కవరపు ప్రభాకర్ రెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.కె.చాన్‌బాషా, దయాసాగర్, అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు శారదమ్మ, గీతాదేవి, మస్తానమ్మ, స్వర్ణమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : తమ న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మాస్టర్ పిలుపుమేరకు 26వ రోజు శనివారం నిరవధిక సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. జిల్లా కౌలు రైతుసంఘం ఉపాధ్యక్షులు గంట లక్ష్మీపతి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగిస్తామని చెప్పడం అత్యంత దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి దేవిరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రమణమ్మ, సెక్టార్ లీడర్లు కామేశ్వరి, జమీల, పద్మావతి, విజయమ్మ, శ్రీదేవి, రుతమ్మ, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కుటుంబానికి జనసేనపార్టీ పరామర్శ**

**ప్రజాశక్తి-సంగం** : మండలంలోని తరుణవాయి గ్రామంలో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త వనమ్మ కుటుంబాన్ని శనివారం ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పరామర్శించారు. వనమ్మ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం కుటుంబానికి రూ.70 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ వనమ్మ కుటుంబానికి అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు భాను కిరణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న నాయకులు

## బకాయిలు వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి-కోవూరు** : చక్కెర కర్మాగారం కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించి తమను ఆదుకోవాలని ఆ సంఘ నాయకులు నాగిశెట్టి వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం వద్ద గల కోవూరు సహకార చక్కెర కర్మాగారం వద్ద శనివారం కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరపించడమేగాక కార్మికుల బకాయిలను చెల్లిస్తామని బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన పాదయాత్ర సభలో రైతులకు, తమకు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. ఎంతో మంది కార్మికులు 2013 సంవత్సరం నుంచి కర్మాగారం మూతపడిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మతిచెందడంతో వారి కుటుంబాలు రోడ్డుపాలయ్యారని వాపోయారు. ఇకనైనా సిఎం జగన్మోహన్‌రెడ్డి మానవతా దృక్పథం తో ఆలోచించి తమకు రావాల్సిన బకాయి లను వెంటనే చెల్లించాలన్నారు. ఎస్.కె అమర్ ఖాన్, కె.రాఘవయ్య, పూర్ణ బహుదూర్, ఎం.శ్రీరామ్, బి.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, జి.మాలాద్రి, ఎండి తస్లీమ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి కానుక పంపిణీ



కానుకను పంపిణీ చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోతల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకు సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నందవరం మోడల్ స్కూల్, బ్రాహ్మణపల్లి, కదిరినాయుడుపల్లి, చుంచులూరు పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం సంస్థ అధినేత పడచల నాగేశ్వరరావు సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ సంక్రాంతి కానుక ద్వారా ఒక్కొక్కరికి రూ 15వందల విలువచేసే నిత్యావసర సరుకులను మండలంలోని రెండు వందల మంది పైగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం సాహో ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల మాజీ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మాజీ మండలాధ్యక్షుడు కటారి రమణయ్య, సాహో ఫౌండేషన్ సభ్యులు సునీత, కర్యావుల రమణయ్య, కలిశెట్టి రాజేంద్రకుమార్, గంగాధర్, దువ్వూరు రవికుమార్, సుధాకర్, చెవుల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సిఐ, ఎస్ఐ

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ప్రజాశక్తి 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌లను సిఐ కార్యాలయంలో శనివారం సిఐ గిరి బాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ గిరిబాబు మాట్లాడుతూ సమాజంలోని అనేక అంశాలను వెలుగులోకి తీసుకువచ్చే దాంట్లో ప్రజాశక్తి దినపత్రిక ముందుంటుందన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా నిరంతరం పని చేస్తున్న ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. దశాబ్దాలకు పైగా పత్రిక రంగంలో ఉన్నత విలువలు కలిగిన జర్నలిజంను ప్రజాశక్తి దినపత్రిక చేస్తుందని, రానున్న రోజుల్లో మరింత ముందుకు వెళ్లాలని కోరారు. వైసిపి యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి, రెడ్డి సంఘం సీతారాంపురం మండల అధ్యక్షులు బేరి భాస్కర్ రెడ్డి, తదితరులున్నారు.

## పోలేరమ్మ జాతరకు అంకురార్పణ



**ప్రజాశక్తి-కావలి** : మూడు రోజులపాటు ఘనంగా జరిగే కావలి పాతఊరు "నడివీధి పోలేరమ్మ జాతర"కు శనివారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు. ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, అంకురార్పణలో పాల్గొని కావలి సంక్షేమం కోసం మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో కావలి పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మంత్రోచ్చారణల మధ్య నడివీధి లో ప్రత్యేకంగ ఏర్పాటు చేసిన స్థలంలో పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, కాటా వెంకారెడ్డి, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఏర్పాట్లపై డిఎస్‌పి వెంకటరమణ, సిఐ రాజేష్ పరిశీలించారు.

# కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



కావలి, ఆత్మకూరుల్లో పారిశుధ్య కార్మికుల నిరసన

**ప్రజాశక్తి-కావలి రూరల్** : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు నాయకులు ఆ సంఘం గౌరవాధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన పర్మినెంట్ హామీని అమలు చేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డైలీ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లో నియమించాలని, రిటైర్మెంట్ బెనెఫిట్ ఐదు లక్షలు గ్రాడ్యుటీ పెన్షన్ విధానం అమలు చేయాలని, ఇంకా మరికొన్ని డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. 12రోజులుగా కార్మికులు సమ్మె కొనసాగిస్తుంటే ప్రభుత్వం రెండుసార్లు చర్చలకు పిలిచి పాత పాటనే పాడి సరిపెట్టుకుంటుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వ సానుకూలంగా స్పందించి పరిష్కరించలేదని ప్రభుత్వం కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా ప్రభుత్వ మొండిగా వ్యవహరిస్తుందని నిర్బంధాలతో ఉద్యమాలను ఆపాలని ఈ ప్రభుత్వం చూస్తుందని కార్మికుల ప్రజలపై గతంలో నిర్బంధాలు ప్రయోగించిన ప్రభుత్వాలు కనుమరుగైపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేంత వరకు ప్రభుత్వాలు ఎన్ని నిర్బంధాలు ప్రయోగించిన పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, తురక సీనయ్య, బిడుదల మహేష్, ఒంగోల్ రమేష్, పోలయ్య, క్రాంతి, మహిళ నాయకులు చిన్నమ్మ, అనిత, రాజ్యలక్ష్మి, జ్యోతి, రాజేశ్వరి, శైలమ్మ రాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిర్వర్తిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ఉధృతం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరు హజరత్తయ్య, సిఐటియు గౌరవాధ్యక్షులు డేవిడ్‌రాజు, వాళ్లకు మద్దతు ఇచ్చి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు నాగేంద్ర, రిజ్వాన్, గురవయ్య, రూబెన్, చిన్న బాబు, తదితరులున్నారు.

**టిడిపి నేతల మద్దతు**



**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : పట్టణంలో మున్సిపల్ కార్మికులు సిఐటియు, ఎఐటియుసి కార్మి కులు తమ సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. శనివారం టిడిపి నాయకులు, 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని సుందరీ కారణంగా తీర్చిదిద్దే మున్సిపల్ కార్మికులకు సమస్యల పరిష్కరించకుండా ప్రభుత్వం మొండివైఖరి విటనాటి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సూరా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ధర్నాలతో దద్దరిలేలా చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మధు, మల్లికార్జున, సిఐటియు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## కంపచెట్ల తొలగింపు



**ప్రజాశక్తి-ఉదయగిరి**

పట్టణంలోని పలు శ్మశానాల రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగింపు చర్యలను ఎంపిపి మూలే పద్మజ వినయ్ రెడ్డి తమ సొంత నిధులతో చేపట్టారు. శనివారం స్థానిక ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య ఆధ్వర్యంలో గండిపాలెం రోడ్డులోని అరుంధతీయపాలెం శ్మశాన వాటిక ఇందిరానగర్ కాలనీ శ్మశాన వాటిక ఆర్‌డబ్ల్యుఎస్ భవనం నుండి వెళుతున్న గండిపాలెం రోడ్డుకు ఇరువైపులా వేపుగా పెరిగిన ముళ్లచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ పంచాయతీలోని సమస్యలను సర్పంచ్‌లు ఎంపిపి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎంపిపి మూలే పద్మజా వినయ్ రెడ్డి తమ సొంత నిధులతో పంచాయతీలో నెల రోజులు నుండి ముళ్లచెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టారన్నారు. దాంతో పంచాయతీలోని ప్రజలు పండుగల మాసాన ఉర్లకు మార్గాలు శ్మశాన వాటికలు శుభ్రం చేయడంతో ఎంపిపికి అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోవింద్, ఎస్‌సిసెల్ మండల అధ్యక్షులు గడ్డం హాజరత్తయ్య, యువ నాయకులు పవన్, ప్రవీణ్, రాజేష్, రాకేష్, యోహాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## హామీని అమలు చేశాం..

**ప్రజాశక్తి-కోవూరు** : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా అమలు చేసిన మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మండలంలో నూతనంగా మంజూరైన 162 నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిరంజన్‌బాబురెడ్డి, శ్రీలత, ఎంపీడీఓ శ్రీహరి ప్రసంగించారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు.

## ప్రభుత్వాన్ని నిలదీస్తున్న అంగన్‌వాడీలు

**వీక్షణం**

**ప్రజాశక్తి-నెల్లూరు** : రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకొనేందుకు ముందు..వెనుకా.. ఆలోచన లేకుండా హామీలు చేసి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయాలన్న ఆలోచన చేయకుండా మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఒక్కొక్కరుగా సమ్మె పేరుతో ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధపడ్డారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోగా చర్చల పేరుతో అంగన్‌వాడీలను, మున్సిపల్ కార్మికులను, సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పిలిచి మమా అనిపిస్తున్నారు. వాస్తవానికి 26 రోజులకు పైగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె బాట పడితే చర్చలకు ఆహ్వానించకుండా అంగన్‌వాడీ కేంద్రాల తలుపులకు ఉన్న తాళాలలను సచివాలయ ఉద్యోగులు, పోలీసుల సహాయంతో పగలగొట్టి అంగన్‌వాడీల మనస్సునొచ్చుకొనే విధంగా ప్రభుత్వం వ్యవహరించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె శనివారం నాటికి 11రోజులు చేరుకొన్నది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికుల స్థానంలో పోటీ కార్మికులను ప్రభుత్వం తీసుకొచ్చి పారిశుధ్య పనులు నిర్వహిస్తుంది. పోటీ కార్మికులను సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్న సందర్భంలో కార్పొరేషన్ అధికారులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడితో మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె తీవ్రస్థాయికి చేరుకుంది. ఇదిలా ఉంటే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు సమ్మె బాటపట్టడం ప్రభుత్వానికి కంటిలో నలుసువలే మారిపోయింది. ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఆయన పిఎ అక్కడికక్కడే మృతి చెందాడు. పర్వతరెడ్డి చెన్నయ్ అపోలోలో చికిత్సపొందుతున్నారు.

## ఆధునికీకరణతో ఆత్మకూరు అభివృద్ధి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆధునిక సాంకేతికత సహకారంతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుకోవడం, ఆధునికీకరణతో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎడిఎఫ్ బృందం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను, పర్యాటక స్థలాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఎఎస్‌పేట దర్గాను, అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు సేవలు అందిస్తున్న ఎంజిఆర్ మున్సిపల్ బస్టాండ్, సమీప ప్రాంతాలు, పట్టణంలోని పలు ప్రధాన రహదారులు వంటి మౌలిక వసతుల కల్పన ద్వారా ఆధునికీకరణ పనులు చేసి భావితరాలకు అభివృద్ధిని అందించాలనే సంకల్పంతో ఎడిఎఫ్ సౌజన్యంతో గత సెప్టెంబర్‌లో తిరుపతిలోని ఐఐటి కళాశాలలో నిపుణుల బృందంతో చర్చించినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్, బెంగళూరు లాంటి ప్రధాన నగరాలలో రోడ్లు సర్కిల్ ప్రాంతాలు అభివృద్ధిలో ఎంతో అనుభవం కలిగిన జనా అర్బన్ స్పేస్ ప్రతినిధుల బృందం ఈ చర్చలో పాల్గొని తాను చేయదలుచుకున్న కార్యాచరణను తెలుసుకున్నట్లు ఎంఎల్ఎ తెలియజేశారు. ఎంఎల్ఎ మేకపాటి కార్యాచరణకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఆత్మకూరు, ఎఎస్‌పేటలలో జనా అర్బన్ స్పేస్ నుంచి డైరెక్టర్ నిత్య, ఆర్కెటిక్ ప్రణాళికలు వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పర్యటించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భవిష్యత్తులో నగరాలకు ధీటుగా పట్టణం నిలిచేలా ప్రణాళికలు సిద్ధం చేసేందుకు క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. రాష్ట్రంలోనే ప్రయివేట్ భాగస్వామ్యంతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు సేవలందిస్తున్న బస్టాండ్‌గా తెలుసుకున్న నిపుణుల బృందం సభ్యులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మాణం సాగించిన ఈ బస్టాండ్ పరిసర ప్రాంతాలను కొద్దిపాటి నిధులతో అభివృద్ధి చేసుకుంటే వ్యాపారాభివృద్ధికి, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా మారుతుందన్నారు. రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల ద్వారా అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. పట్టణంలోకి వచ్చే బైపాస్ రోడ్డును హనుమాన్ జంక్షన్ నుండి మెయిన్ బజార్ వరకు రోడ్డును, పట్టణ వ్యాపారుల కేంద్రంగా ఉన్న వైశ్యబజార్ ప్రాంతాలను పరిశీలించి ఇరువైపులా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల గురించి నాయకులతో మాట్లాడారు. అనంతరం ఆత్మకూరు చెరువును పరిశీలించిన బృందం సభ్యులకు గతంలో ఉన్న ప్రతిపాదనలు పట్టణ నాయకులు వారికి వివరించారు. చెరువును పరిశీలించిన నిపుణుల బృందం సభ్యులు హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరిగా బోటింగ్, వాకింగ్ ట్రాక్‌తో పాటు పార్కుల నిర్మాణాలు చేపట్టవచ్చని, చెరువు అభివృద్ధి గురించి ప్రణాళికలు సిద్ధం చేస్తామని, దాని ద్వారా పట్టణ ప్రజలకు ఆనందం, ఆహ్లాదంతో పాటు వ్యాపారాభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎఎస్‌పేట దర్గాలోని శ్రీ హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకున్నారు. దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలించి ఇంత తక్కువ విస్తీర్ణంలో చాలా ఎక్కువ మంది భక్తులు ఉండడంతో పర్యాటక అభివృద్ధికి అవసరమైన ఆధునిక హంగులు ఏర్పాటుతో పాటు అభివృద్ధి పనులు చేస్తే భక్తులు సంఖ్య పెరిగినా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేయవచ్చునని నిపుణుల బృందం సభ్యులు పేర్కొన్నారు. ఎఎస్‌పేట దర్గా, ఆత్మకూరు మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు, ఆత్మకూరు నియోజకవర్గం మూడు జాతీయ రహదారుల అనుసంధానంగా, భవిష్యత్తులో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా వ్యాపారాభావృద్ధి, పర్యటకాభివృద్ధి దిశగా ఆలోచించి ప్రణాళికలను నెల రోజుల్లోపు సిద్ధం చేసి అందించాలని బృందం సభ్యులకు సూచించారు. బృందం వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, మహేష్ ఉన్నారు.



పట్టణంలో పరిశీలిస్తున్న ఎడిఎఫ్ బృందం

## కరోనా ముప్పుపై అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి-కావలి**

దేశంలో కరోనా మరణాలు కలవరపాటుకు గురి చేస్తున్నాయని, అప్రమత్తత అవసరమని రోటరీక్లబ్ ప్రముఖులు శ్రీలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ డాక్టర్ కె.మాధవరెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీలక్ష్మి విద్యాసంస్థలకు చెందిన ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు పాతవూరు కృష్ణుని బొమ్మ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, ఉదయగిరి బ్రిడ్జి సెంటర్లలో ఫ్లాష్ మోబ్ (మెరుపు మూక నృత్యాలు)తో కరోనాపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలను పాతవూరు నాయకులు జెనిగర్ల మహేంద్ర, ఈతముక్కల చందు ప్రారంభించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ మహానగరాలకే పరిమితమైన ఫ్లాష్ మోబ్‌ను కావలికి పరిచయం చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు మాస్కులు పంపిణీ చేశారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

సర్వేనెంబర్ 163/1లో 100 సంవత్సరాల పైగా ఉన్న 1.01 సెంట్లు దొరువు స్థలాన్ని నకిలీపేపర్లు సృష్టించి దొరువు స్థలాన్ని ఆక్రమణ చేస్తున్న చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని నరసాపురం గ్రామ రైతులు డిమాండ్ చేశారు. శనివారం సోమరాజు పల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో తహశీల్దార్ సుబ్బయ్యకు దొరువు ఆక్రమణ విషయమై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీసర్వేలో నకిలీ పత్రాలు సృష్టించి ఎల్‌పిఎం నెంబర్ పొందారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపై రౌడీ మూకలతో దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కర్మక్రుతులకు, ఇతర అవసరాలకు వాడుకుంటున్న దోరువును దక్కించుకోవాలని సదరు ఆక్రమితదారుడు చూస్తున్నారని అధికారులు చొరవ తీసుకొని గ్రామస్తుల అవసరాల ఉపయోగపడే దోరువును పరిరక్షించి దొంగ పేపర్లు సృష్టించిన చంద్రశేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గంపల అనిల్, గంపల రఘురామయ్య, తోకల మురళి, చీమకుర్తి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణాలకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-అల్లూరు:**

మండల పరిధిలోని ఇసుకపల్లి గ్రామపం చాయతీ బిఎంఆర్ గిరిజన కాలనీలో నూతన గృహలకు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్ర మాన్ని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు నిర్వహించారు. కార్యక్రమంలో బీద రమేష్, ఎంపిపి శశిరేఖ, జెడ్‌పిటిసి వేనమ్మ, సర్పంచ్ రమేష్ రంజిత్, విద్య కమిటీ ఛైర్మన్ వాసు, మునిరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, కార్యకర్తలు, అబిమానులు పాల్గొన్నారు.

## సిసిరోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-జలదంకి**

మండలంలోని అన్నవరం హరిజనవాడ, గిరిజన కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి నియోజక వర్గం సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి మంజూరు చేయించిన రోడ్లకు మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట ఎస్‌సిసెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ దామెర్ల దేవదాసు, గ్రామ సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ తనయుడు గుమ్మడి రమేష్ పాల్గొన్నారు. అనంతరం జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరైన వాటర్ ట్యాంక్ నిర్మాణ పను లను పరిశీలించారు. వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి మేకపాటి రాజ గోపాల్ రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామని మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండా రెడ్డి తెలియజేశారు.

# వైసిపి పాలనలో ఎస్‌సి,ఎస్‌టి, బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్:

గడిచిన నాలుగున్నరేళ్ల వైసిపి పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం చేశారని తెలుగుదేశం పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు.నెల్లూరు నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రశ్నిస్తే పోలీస్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మతం, ప్రాంతం చూడమని ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు అన్ని వర్గాలను పట్టిపీడిస్తున్నా రన్నారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి


మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

సామాన్యుడిపై మోయలేని భారాలను మోపారన్నారు. ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా మోపని విధంగా చివరకు చెత్తను కూడా వదలకుండా చెత్త పన్ను వేశారని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి మడమ తిప్పారని ధ్వజమెత్తారు. నెల్లూరు రూరల్‌లో బీసీ భవన్ అసంపూర్తిగా నిధుల్లేక మూలన పడిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి-జనసేన ప్రభుత్వం ఖాయమని 57శాతం ఓట్లతో 160 సీట్లను గెలుపొందుతామన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల పరిరక్షణ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రా కదలిరా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున స్పందన వస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పేరుతో రూపొందించిన పథకా లకు గ్రామీణ ప్రాంతాల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు తాటి వెంకటేశ్వర్లు, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, మలినేని వెంకయ్య నాయుడు, కాకుపల్లి శివ, నందిపాటి శ్యామ్ పాల్గొన్నారు.

# ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ**

విజయవాడలో ఈనెల 19వ తేదీన అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక వి.ఆర్.సి కూడలిలోని అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అన్ని అంబేద్కర్ విగ్రహాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని,


అంబేదక్కర్ విగ్రహానికి పూలమాలేస్తున్న దృశ్యం

నూతన శోభను సంతరించుకునేలా ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రజలంతా 8వ తేదీ నగరంలోని అన్ని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు.విజయవాడలో ఆవిష్కరించనున్న అంబేద్కర్ స్మృతివనం గురించి 9వ తేదీన స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో సభను ఏర్పాటు చేసి ప్రజలను ఆహ్వానించాలన్నారు. అన్ని సచివాలయాల్లో సిగ్నేచర్ క్యాంపులను నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నిజం మాట్లాడని సిఎం

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ**

అబద్ధం తప్ప నిజం మాట్లాడలేని ముఖ్యమంత్రి ఉండటం మన రాష్ట్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర పేర్కొన్నారు. నెల్లూరు టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూ.3వేలు పెన్షన్ ఇస్తాని నమ్మించి వంచించిన జగన్ రెడ్డి పెన్షన్ల గురించి


మాట్లాడుతున్నగంజాం రాఘవేంద్ర

నిజాలు చెప్పే ధైర్యం ఉందానన్నారు. రూ.3 వేల పెన్షన్ పై మాట మార్చి ఒక్కొక్కరికి రూ.30వేలు ఎగనామం పెట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి రూ.200 ఉన్న పెన్షన్ 2019 నాటికి రూ.2000 చేశారనీ, ఐదేళ్లలో రూ.1800 పెంచిపెన్షన్ లబిదారుల సంఖ్య 34 లక్షల నుండి 54.25 లక్షలకు అందిం చారన్నారు. జగన్ రెడ్డి ఇప్పటి వరకు పెంచింది రూ.750 మాత్రమే అందించి ఉద్ధరించానని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో రూ.7లక్షల కోట్ల బడ్జెట్ మాత్రమే ఉన్నప్పటికీ 20 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చి, పెన్షన్ మొత్తాన్ని కూడా రూ.1800 వరకు పెంచారన్నారు. జగన్ మోహన్ రెడ్డి రద్దు చేయడం తప్ప కొత్తగా ఎంచేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

**ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్**

స్థానిక 28వ డివిజన్‌లో 30 లక్షల రూపాయలతో డివిజన్ ఇన్‌ఛార్జ్ నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో, రోడ్డు కాలువలు అభివద్ధి పనులకు శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ పాల్గొని మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్లు,18 గ్రామాలలో అభివద్ధి బాటసారిగా ఎం.పి.ఆదాల ప్రభాకర్ రెడ్డి నిలిచారన్నారు. ఆదాలకు ఓటు అభివద్ధికి


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

చోటు అని పేర్కొన్నారు.నేడు నియోజక వర్గ ప్రజలందరూ ఆదాల ప్రభాకర్ రెడ్డి చేస్తున్న అభివద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, గత 25 ఏళ్ల నుంచి ఈ రోడ్డును ఎవరు పట్టించుకోలేదన్నారు. నేడు ఆదాల ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వచ్చాక ఈ రోడ్డుకు మోక్షం లభించిందన్నారు.ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో ఆలోచించి అభివద్ధి ప్రదాత ఆదాల ప్రభాకర్ రెడ్డిను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అందరం జగనన్నకు మద్దతుగా, రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్ రెడ్డి అన్నను గెలిపించు కుందామని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎడ్లబండ్ల పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 1వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో కోడూరుపాడు గ్రామంలో శ్రీ ఊళ్ళమ్మ తల్లి కుంభాభిషేకం సందర్భంగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనను శనివారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకు నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒకటి రెండు డివిజన్ల కార్పొరేటర్లు జానా నాగరాజ్ గౌడ్, పి రామ్మోహన్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, లేబూరు పరమేశ్వర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్ యాదవ్, స్థానిక వైసిపి నాయకులు, ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీదారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి-మర్రిపాడు**: మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్, సామాజిక వేత్త, రచయిత, ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలేల జయంతి సందర్భంగా ఆవాజ్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ కళాశాలలో 8,9,10, ఇంటర్ విద్యార్థినులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మండల అభివృద్ధి అధికారిణి నాగమణి సోమవారం బహుమతులు అందజేస్తామని ఆవాజ్ మండల కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సయ్యద్ రహమతుల్లా, కార్యదర్శి సయ్యద్ గౌస్ బాషా, ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆవాజ్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వసతిగృహాల్లో ఇబ్బందులు

**ప్రజాశక్తి-కావలి**: దళిత, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చదుకునే పిల్లలు కష్టాల్లో ఉన్నారని వారిని కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయ రత్నం, జి అశోక్, ఎన్ రుషి, కె చందు, సిహెచ్ శశికుమార్, చౌటూరి వెంకటరత్నం, గోళ్ళ తిరుపతి, రాము, రాకేష్ పాల్గొన్నారు.

## 'ఉపాధి' సిబ్బందికి శిక్షణ

**ప్రజాశక్తి-మర్రిపాడు**: స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బందికి రెండు రోజులు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని ఎపిఒ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ శిక్షణలో పాత పనులు, జరుగుతున్న పనులకు సంబంధించి, కొత్త పనులను గుర్తించి వాటిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ కల్పించి మేట్‌లు తమకు కేటాయించిన విధులను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగమణి, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న సిఎం జగన్

**ప్రజాశక్తి-బిట్రగుంట**: ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు రూ.3వేలు పెన్షన్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని నాగులవరం సీనియర్ నాయకులు మల్లారెడ్డి అన్నారు. బోగోలు మండలం నాగులవరం సచివాలయంలో శనివారం లబ్ధిదారులకు సీనియర్ నాయకులు మల్లారెడ్డి, పాపన్న పెన్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాగులవరం సర్పంచ్ రేగలగడ్డ రామారావు, గృహ సారథులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పింఛన్‌దారులు, గ్రామస్తులు తదితరులున్నారు.


పింఛన్ అందజేస్తున్న దృశ్యం